# సంక్రాంతికానక

శ్రీమతి లక్ష్మిగారు

"పద్మా, ఈయేడు బొమ్మలు పెడతావు టోయ్" అంది, ప్రక్కఇంటిలీల.

"ఏం పెట్టకా? యీసారి మాఅన్న య్యకూడా సాయంచేస్తా నన్నాడు."

"ఏమో లే, నిరుడూ ఇలాగే చెప్పి, మీ మేనమామగారింటికి వెళ్లావు."

"లేదుగా, యీసారి వెళ్లను. చూస్తూ వుండు."

"ఏంబొమ్మలుకొంటావోయ్,యీసారి?"

"ఆ, ఏంబొమ్మలు? అన్నీ వున్న వేగా. మానాన్నగారు కొంటా నంటే, చలవరాతి బొమ్మలు తప్ప ఇంకేమీ కొనను. నువ్వో?"

"నాకు మానాన్నగారు, 'మంచిచీర కొంటాను. బొమ్మలొద్దోకొనను' అన్నారు. ఏం చేస్తారో తెలీదు. బొమ్మలనోము నోస్తావా?"

"ఆహా"

"వరహాలుగారింటికి వెళ్లోద్దాము వస్తా వా?"

"సరే, పద."

[ఇద్దరూ వెళ్లిపోయారు.

* * * * *

"అమ్మా, బల్లలు అవీ సర్దుతున్నావు బొమ్మలకేనా?" అంది పద్మాసని.

"అవునమ్మా, అన్నయ్య ఇంటికి రాగానే బొమ్మలు పెడుదామని బల్లలు వేయిస్తున్నాను. నువ్వుకూడా ఇంట్లో వుండు. ఎక్కడకూ వెళ్లకు."

"ఉంటాను గాని, బొమ్మలమాట ఏమ న్నారు, నాన్నగారు?"

"ఏముంది, కొనటమే."

"అమ్మా, మరే, లీలకు వాళ్లనాన్న గారు మంచి శిల్కుచీరె కొంటారుట. నాకు నాన్నగార్ని కొనమనవూ?"

"ఆలోచిందాలే."

* * * * *

"అమ్మా, బావకు జ్వరం వస్తోందని వుత్తరం వచ్చింది" అన్నాడు, పద్మఅన్నగారు.

"ఏమో చదువుతా విను. 'మీఅల్లు డికి ౧౦౩, ౧౦౪, జ్వరం వస్తోంది. చాలా వుద్దడిగా వుంది. ఇద్దరుడాక్టర్లను పెట్టి, మందు జరుపుతున్నాము. మా కేమీ తోచుట లేదు. మాపద్మాసనిఅదృష్టం మెట్లున్నదో తెలియుటలేదు.' అని వుంది."

"సరే, పులిమీద పుట్రల్లె, ఇదొకటా? ఏదో వకటి, మనస్సు కులాసాగా వుండ నివ్వదు. మొన్నటిదాకా పద్మజబ్బుకు దిగు లుపెట్టుకోడం సరిపోయింది. ఇప్పుడిది. కానీ, భగవంతు డున్నాడు."

* * * * *

"అమ్మా, బొమ్మలనోము పట్టటం మెల్లుండే కదూ" అన్నది పద్మ తల్లితో.

"అవును గాని, ఇప్పు డెందుకమ్మా? ఓమూల అతనికి జబ్బుగా వుందని వుత్తర మొచ్చిందామెను. మనస్సు స్వస్థతగా లేదు. యీయేటి కొద్దమ్మా."

"కాదమ్మా, నేను నోచుకుంటాను తప్పకుండాను. నువ్వు అడ్డు చెప్పకు."

"నీకు తెలియదు, వెర్రితల్లీ, వూరుకో. వాళ్లు వింటే బాగుండదు. బొమ్మలు పెట్టిం దానికే నాకు కష్టముగా వుంది. యీమాటు వద్దు తల్లీ."

"అమ్మా, నేను చెయ్యక మానను. నువ్వేమీ అనుకోక. ఏం భయం లేదు. నన్ను నోము చేయనీ. దానిఫలం తర్వాత చూద్దువు గాని" అంది, గంభీరంగా పద్మ.

"సరే, నీఇష్టం తల్లీ. నీధైర్యమే నిన్ను కాపాడగలదు."

* * * * *

బొమ్మలనోము రెండుదినా లయింది. మూడోనాడు బొమ్మల నెత్తుదామని అన్నీ సిద్ధంచేసుకుంది పద్మాసని. తల్లికిమాత్రం ఇష్టం లేదు. పద్మ ధైర్యంతో జరుపుతోంది. వెళ్లి, పేరంటాని కందర్నీ పిల్చుకొచ్చింది. ఇంతలోకే మామగారివద్దనుంచి వుత్తర మొచ్చింది: 'ఇంకా నెమ్మది లేదు, అల్లాగే వుం' దని. ఇం కేముందని, అందరూ ఒకటే కంగారు పడుతున్నారు కాని, పద్మమాత్రం నిశ్చింత గానే వుంది. ఆపిల్లధైర్య మేమిటో మనకు తెలియదు. ఎల్లాగో బొమ్మల నెత్తడంకూడా అయిం దనిపించారు. పద్మ ప్రస్తుతం చేసే పనేమిటో తెలుసునా? ఇరువదినాల్గుగంటలు సావిత్రిదేవిపూజ, దేవీధ్యానము, దేవీస్తవ ములు. ఇంతే ఆమె చేసేపని. బొమ్మలనోము చివరరోజు వచ్చింది. ఆవేళ అమ్మవారిని వాల లాడింపు. పద్మ హడావిడి పడుతోంది. అటు కులు పెరుగులో నానవేసుకుంది. అమ్మవారి తోకూడా చెరువుదాకా వెళ్లటానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంది. తల దువ్వి జడ వేసు కుంటుండగా, వుత్తర మొచ్చిందని తండ్రి చెప్పటానికి వచ్చారు.

"ఏమని వచ్చిందండీ?" అంది వాళ్లమ్మ.

అల్లుడికి వళ్లు నింపాదిగా వుందిట. పథ్యం నిన్ననే పెట్టేరుట."

"ఆచేతులో ప్యాకెటు ఏమిటి?" అన్నది పద్మాసని

"నీకే; మామామగారు ఆగ్రాచీర పంపారు. 'అబ్బాయివళ్లు నెమ్మదిగా యుండు ట, మనపద్మ అదృష్టమే కారణము గనుక, ఈచీరె ఆమెకు సంక్రాంతికానుకగా పంపడ మైనది' అనికూడా వ్రాశారు వుత్తరంలో."

"నే చెప్పలేదే అమ్మా! నోముఫలితం. నువ్వే చూద్దువుగానని?" అంది, సంతోషంగా, పద్మ.

"అవునమ్మా, నిజమే. నీధైర్యము, నీదే వీపూజవల్లనే ఇంతవరకు తేలేం. ఆదేవికి మన మీద పరిపూర్ణకటాక్ష మున్నదన్నమాటే."

"అమ్మా, చీరె చూడు. ఎల్లా వుందో!" అని తల్లి చేతి కందించింది.

"అవునమ్మా, బాగుంది. ఇప్పుడు కట్టు కుని, అమ్మవారివాలలాడింపుకు వెళ్లు. నీవు నాన్నగారిని తెచ్చిపెట్టమని కోరావు కదూ అది సావిత్రీదేవి యీవిధంగా ఇచ్చింది?" అన్నది.